
# ఉన్నత పాఠశాలలో పిఆర్టీయు క్యాలెండర్ ఆవిష్కరణ.



**ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్, జనవరి, 29(డిడి9వార్త న్యూస్):-** బజార్ హత్నూర్ మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల లో గురువారం రోజు పి ఆర్ టీ యు ఉపాధ్యాయ సంఘం సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సమస్య పై చర్చించారు. అనంతరం 2026 సంవత్సరానికి సంబందించిన క్యాలెండర్ను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టీ యు రాష్ట్ర బాద్యులు సామాల రాజు,బజార్ హత్నూర్ ప్రధాన ఉపాధ్యాయులు జె. భూమన్న, దేగాం ప్రధాన ఉపాధ్యాయులు ఉమండల విద్యావనరుల కేంద్రం ఇంచార్జి ఐనరాంకిషన్,ఉపాధ్యాయులుఆశ్రాఫ్, చంద్రకాంత్ బాబు, శేఖర్, పి ఆర్ టీ యు ఉపాధ్యాయులు తదితరులు పాలొగొన్నారు.

# దిశ క్యాలెండర్ ఆవిష్కరణ



**డిడి 9 వార్త గుడిహత్నూర్:** డిజిటల్ పత్రిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన దిశ 2026 క్యాలెండర్ ను గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సై శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆనతి కాలంలోనే దిశ పత్రిక అందరికీ అందుబాటులో వచ్చి పాఠకుల మన్నలను పొందిందని అన్నారు. ఎప్పటికప్పుడు వార్తలను సేకరించి ప్రత్యేక ఎడిషన్లు ,క్లిప్పింగ్ లు డిజిటల్ మద్యమాల ద్వారా పంపుతూ ప్రజలకు ,అధికారులకు దగ్గరైదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధామన్ గూడా సర్పంచ్ మడావి ముకుంద్ రావ్ ఉపసర్పంచ్ సిడ్మాకి కృష్ణ,ధాన్ ఫౌండేషన్ సీఈఓ కొత్తూరి సునీల్ కుమార్, నాయకులు జనుగురు మహేష్,కాంబ్లే మారుతి, కళ్ళేపెల్లి దేవేందర్,మల్లెకర్ విజయ్, పాత్రికేయులు రాహుల్, కోల నగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై ప్లాస్టిక్ క్రేట్లు

**డిడి9 వార్త గుడిహత్నూర్ :** కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో భారీ రాయితీపై ప్లాస్టిక్ క్రేట్లను అందజేయనున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి డి. నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పంటలను సురక్షితంగా నిల్వ చేయడం, రవాణా చేయడం కోసం ఉపయోగపడే ప్లాస్టిక్ క్రేట్లకు ప్రభుత్వం 50 శాతం రాయితీ అందిస్తోందని ఆయన తెలిపారు. ఒక్కో ప్లాస్టిక్ క్రేట్ అసలు ధర రూ.337 కాగా, రాయితీతో కేవలం రూ.169కే రైతులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 40 క్రేట్ల వరకు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అదేవిధంగా ఉద్యాన పంటల సాగులో ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచే లక్ష్యంతో 50 శాతం రాయితీపై ఉద్యాన యాంత్రీకరణ పరికరాలను కూడా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో బ్రష్ కటర్, పవర్ స్ప్రేయర్, పవర్ వీడర్ వంటి ఆధునిక పరికరాలు కూడా ఉన్నాయని వివరించారు.ఈ పథకం ద్వారా లబ్ధి పొందదలచిన ఆసక్తిగల రైతులు తప్పనిసరిగా పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే సంబంధిత డీహెచ్ఎస్‌వో (ఐనూూ) పేరిట తీసిన డీడీతో ఉద్యాన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకొని తమ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు కోరారు.

# అనుమతి లేక మొరం తరలింపు- - 5 టిప్పర్ లారీలు సీజ్



**బోథ్, జనవరి,29 (డిడి9వార్త న్యూస్ ) :-** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల పరిధిలోని డేరా గ్రామ శివారంలో ఎలాంటి అనుమతులు లేకుండా యతేచ్ఛగా మోరాన్ని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్న సమాచారం అందుకున్న బోథ్ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ వి.పురుషోత్తం, రాక్షక భటులు సాయి కృష్ణ, శ్రీకాంత్, సుధాకర్లను తో లుకొని అక్రమ మొరం తరలిస్తున్న 5 టిప్పర్ల ను పట్టుకుని బోథ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఆ 5 టిప్పర్ల పై దొంగతనం కేసు నమోదు చేశారు.అనుమతులు లేకుండా మొరం, ఇసుక లాంటి వస్తువులు తరలించిన పక్షంలో చట్ట పరమైన చర్య తీసుకోవడం ఉంటుందని ఈ మేరకు బోథ్ ఎస్ఐ.వి.పురుషోత్తం తెలిపారు.

# మధ్యాన్నభోజన కార్మికుల బకాయిలు వెంటనే విడుదలచేయాలి

**బజార్హత్నూర్, జనవరి 29(డిడి9వార్త న్యూస్):-** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బకాయి బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయుసి రాష్ట్ర నాయకుడు కుంటాల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యాలయంలో గురువారం రోజు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు బకాయిలో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న కార్మికులను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు సామాజిక భద్రత పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఏఐటీయుసి అధ్వర్యంలో ఉద్యమా లను




ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కీర్తి రమణ,అనిత,లక్ష్మి,బి లక్ష్మి,రాజారాం, లక్ష్మి, మండలలోని పలువురు కార్మికులు తదితరులు పాల్గొ న్నారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు.

# గ్రామ సింహాలకు వింత రోగంమనుషులకు ప్రాణ సంకటం

**ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్, జనవరి 29,(డిడి9వార్త న్యూస్):-** పనికిమాలిన వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు.గుంపులు గుంపులుగా చేరి అమాయక ప్రజలపై దాడి.విచ్చలవిడిగా పెరిగినకుక్కలు(గ్రామసింహాలు )కుక్కల్లో వింత చర్మ వ్యాధి మనుషులప్రాణాలు హారించేట్టు ఉందని ఆందోళన చెందుతున్న జనాలు. అంటువ్యాదిలా మనుషులకు సోకే ప్రమాదం ముందు ముందు రావచ్చునిపశువైద్యులహెచ్చరిక. ముందు జాగ్రత్త చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది.వివిద గ్రామంలలో వీధి కుక్కలు విపరీతంగాపెరిగాయి. అదే విధంగా చర్మ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నాయి.శరీరమంతా మచ్చలు, దురదతో అవి విలవిల్లాడుతున్నాయి.ఈ వ్యాధి ఒకదాని నుంచి మరొకదానికిఅంటువ్యాదిగా వ్యాపిస్తుండటంతో పాటు, వ్యాధిగ్రస్త కుక్కలు జనసంచారం ఉన్న ప్రాంతాల్లో తిరుగుతుండటం. మనుషులకు సోకే ప్రమాదం ఉంది.డంపింగ్



యార్డ్,మాంసం విక్రయ కేంద్ర దుకాణాల వద్ద కోడి వ్యర్థాలను తినడం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలుస్తోంది.కోళ్ల పెంపకంలో వాడే యాంటీబయాటిక్స్, మందుల అవశేషాలు పేగుల్లో నిల్వఉండటమే దీనికి కారణమని పశు వైద్యులు అభిప్రాయంలు వ్యక్తం చేస్తున్నారు.గాలి ద్వారా కూడా వ్యాపించే ప్రమాదం ఉందని తెలుస్తుంది. వీధి కుక్కల విషయంలో ఆయాగ్రామాలసర్పం చ్లు,పాలక మండలి, సంబందించిన పంచాయతీ శాఖ అధికారులు తగు నివారణ చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలనిపలుగ్రామాల ప్రజలు మనవి చేస్తున్నారు.

# కీలకంగా మారిన మెజార్టీ మాదిగ ఓటర్లు

**ఆదిలాబాద్ జిల్లా బ్యోరో (డిడ9 వార్త న్యూస్)**గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ లక్ష్యం కై మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు దేశ ప్రధానమంత్రి తమ జాతి కల నెరవేరుస్తారని నమ్మకంతో పార్లమెంట్ మరియు నియోజకవర్గ పరిధిలో ఎమ్మార్పీఎస్ అందించిన సంపూర్ణ మద్దతుతో బిజెపి అభ్యర్థి పాయల్ శంకర్ గెలుపొందడం 100% స్వయంగా ఎమ్మెల్యే ఒప్పుకోవడం తో పాటు పలు వేదికల మీద ప్రకటించారు. ప్రస్తుతం 49 మున్సిపల్ వార్డులలో 06 స్థానాలు ఎస్సీ రిజర్వు కి కేటాయించారు. ఈ స్థానాలతో పాటు గతంలో ఎస్సీ స్థానాలుగా ఉన్న వాటిలో మెజార్టీ మాదిగ ఓటర్లు ఉన్నారు, అలాగే అక్కడక్కడ జనరల్ స్థానాల్లో మాదిగల ఓట్లు గెలుపు ఓటమిలను శాసించే స్థాయిలో కీలకంగా మారాయి ఈ నేపథ్యంలో క్యాడర్ పరంగా సంస్థాగతంగా బలమైన నిర్మాణం కలిగిన ఎమ్మార్పీఎస్ మద్దతుతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో కీలకంగా మారడం అందుకు నిదర్శనం ఉదాహరణకు, గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా కేంద్రంలో వేలాదిమంది దండోరా డప్పుల దరువులతో డైట్ కాలేజ్ గ్రౌండ్ రామ్ లీలా మైదానం నుండి, అంబేద్కర్ చౌరస్తా వరకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం వలన ఆ రోజే స్థానిక ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని పలు పత్రికలలో మరియు సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో బలమైన సంకేతం వెళ్ళింది, గత రెండు సంవత్సరాల నుండి పదవి చేపట్టిన స్థానిక ఎమ్మెల్యే మాదిగల సమస్యలపై స్పందించిన విధానాలపై నెమరు వేసుకుంటే ఆ యొక్క వర్గం వారిపట్ల కొంత సముఖంగా ఉన్నట్లు లేదని చెప్పవచ్చు? అలాగే ప్రస్తుత మునిసిపల్ ఎన్నికల్లో ఆరు ఎస్సీ రిజర్వేషన్ స్థానాలకు మాదిగలకు సరైన గౌరవం దక్కకపోతే అది మాదిగల నుండి బిజెపికి మధ్య మరింత గ్యాప్ పెరిగే అవకాశం లేకపోలేదు ఈ విధానం అన్ని పార్టీలకు కూడా వర్తిస్తుందని మాదిగల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ ప్రధాన నాయకుడు ఇదివరకే అన్ని పార్టీలకు మీడియా ద్వారా అల్టిమేటశీ పంపడం గమనార్హం.మాదిగలకు సమన్యాయం సామాజిక న్యాయం టికెట్లు కేటాయింపు చేయడంలో ఆత్మరక్షణలో పడ్డ బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎటువైపు తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డది, ఏది ఏమైనా మాదిగ ఓటర్లు అదిలాబాద్ బల్దియ పీఠంపై ఎవరిని కూర్చోబెడతారనేది త్వరలో అభిప్రాయం తేలబోతుంది.






# ఎమ్మెల్యే ధన్‌పాల్ సమక్షంలో బీజేపీలోకి భారీ చేరికలు

**- 22వ డివిజన్ నుంచి కమలం గూటికి 300 మంది**



**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరంలో భారతీయ జనతా పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. నగరంలోని 22వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ పోతుల పురుషోత్తం ఆధ్వర్యంలో సుమారు 300 మంది కార్యకర్తలు కమలం తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభ్యర్థులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలన, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అనేకమంది యువ కులు, సీనియర్ నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. 22వ డివిజన్ నుంచి పోతుల పురుషోత్తంతో పాటు తాటికొండ రాము, ఆకుల శ్రీనివాస్, రాజ్ కుమార్, గౌత ఆనంద్, కుందన్ శ్రీనివాస్ వంటి ముఖ్య నేతలు చేరడం పార్టీకి మరింత బలాన్నిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీజేపీకి అండగా



ఉంటామని చేరిన నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివక్షను వీడి ప్రగతి బాటలో విజేత

- ఘనంగా సహకార సంఘం 4వ వార్షికోత్సవం
- నూతన పాలకవర్గం ఏకగ్రీవం

**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** సామాజికంగా ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్న మన విజేత పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజశ్రీ కొనియాడారు. గురువారం నగరంలోని ఖానాపూర్ కలూర్ రోడ్డులో గల వర్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సంఘం 4వ వార్షిక మహాజన సభను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, జీజీహెచ్ ఆర్ఎంఓ సాయికుమార్‌లతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్షను ఎదుర్కోవడానికి ఆర్థిక బలం ఎంతో అవసరమని అన్నారు. పరస్పర సహకారంతో సభ్యులందరూ పొదుపు చేసుకుంటూ అవసరమైన వారికి రుణాలు అందిస్తూ ఒకరికొకరు ఆసరాగా నిలవడం గొప్ప




విషయమని ప్రశంసించారు. ప్రభుత్వ పరంగా అందే రాయితీలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీడబ్ల్యూఓ రసూల్ బి మాట్లాడుతూ.. మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఇటువంటి సహకార సంఘాలు వెన్నుముకగా నిలుస్తాయని సంఘం బలోపేతానికి తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోయే ఏడాదికి సంబంధించి సంఘం ప్రతినిధులు భారీ లక్ష్యాలను ప్రకటిం చారు. ప్రస్తుతం ఉన్న సభ్యులకు తోడుగా వచ్చే ఏడాదిలో మరో 300 మంది కొత్త సభ్యులను చేర్చుకోవాలని నిర్ణయించారు. కేవలం పరపతి (అప్పులు) అందించడమే కాకుండా, సభ్యులు సొంతంగా కాలూనుకునేలా వివిధ వృత్తి విద్యల్లో ఉపాధి శిక్షణ అందించాలని తీర్మానించారు. అనంతరం సంఘం నూతన పాలకవర్గాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ కౌన్సిలర్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ప్రతినిధులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు పాల్గొన్నారు. వర్డ్ సంస్థ ప్రతినిధి ధర్మందర్ మాట్లాడుతూ సంస్థ ద్వారా సంఘానికి అందిస్తున్న సాంకేతిక, సామాజిక మద్దతును వివరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీ-ఫాం ఉంటేనే పార్టీ అభ్యర్థిగా గుర్తింపు : జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

- ఆర్మూర్ నామినేషన్ కేంద్రం పరిశీలన

**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు రాజకీయ పార్టీల తరపున పోటీ చేయాలంటే గడువులోగా విధిగా బీ-ఫాం సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆర్మూర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..




పార్టీ గుర్తులపై పోటీ చేసే అభ్యర్థులు బీ-ఫాం అందజేయడంలో విఫలమైతే, వారిని స్వతంత్ర అభ్యర్థులుగానే పరిగణించడం జరుగుతుందని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం బాలికల కళాశాలలో ప్రత్యేకంగా ఆరు గదులను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి గదికి రిటర్నింగ్ అధికారులను నియమించామని, ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని వెల్లడించారు.

# ఎన్నికల ఖర్చులపై అధికారుల నజర్

**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఆడిట్ ప్రక్రియ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేసిన ఖర్చుల్లో పారదర్శకతను నిర్ధారించడమే లక్ష్యంగా అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, గెలుపోటములతో సంబంధం లేకుండా అందరూ తమ ఖర్చుల వివరాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు తమ వ్యయ పత్రాలను అధికారులకు అందజేశారు. నిబంధనల



ప్రకారం ప్రచార ఖర్చులు, వాహనాలు, ఇతర ఖర్చుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆడిట్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ సదాశివ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో వ్యయ పరిమితిని మించకుండా ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నా రు. నిబంధనలు ఉల్లంఘించినా లేదా తప్పుడు వివరాలు అందజేసినా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో పటిష్ట బందోబస్తు సీపీ సాయి చైతన్య పర్యవేక్షణ



**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తుల భద్రతే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం కదులుతోంది. గత రెండు రోజులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జాతర ప్రాంగణంలోనే ఉండి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జాతరకు పోటెత్తుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీపీ భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గద్దెల పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్‌పై కక్షసాధింపు ఆపాలి : మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

- - వేల్పూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** తెలంగాణ సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపులో పరాకాష్ట అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించేందుకే విచారణల పేరుతో డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. ప్రస్తుత మంత్రివర్గాన్ని దండుపాళ్యం బ్యాచ్ గా అభివర్ణిస్తూ.. బొగ్గు, సోలార్ పవర్, సింగరేణి డీజిల్, ఎక్సైజ్ రంగాల్లో భారీ కుంభకోణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీటిని హరీష్




రావు ఆధారాలతో సహా బయటపెట్టారని గుర్తుచేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను కేసుల పేరుతో భయపెట్టి, క్షేత్రస్థాయిలో పనిచేయకుండా అడ్డుకోవడమే రేవంత్ రెడ్డి అసలు వ్యూహమని దుయ్యబట్టారు. పెన్షన్లను పదింతలు చేసి, రైతులకు 24 గంటల కరెంట్, రైతుబంధు అందించిన మహోన్నత నాయకుడు కేసీఆర్ అని వేముల కొనియాడారు. "కోట్లాది మంది గుండెల్లో ఉన్న నాయకుడిని పోలీసులను అడ్డం పెట్టుకుని వేధిస్తే.. ఆ ఉసురు ఈ ప్రభుత్వానికి తగలకుండా పోదు" అని హెచ్చరించారు. న్యాయం తమ వైపే ఉందని, ఈ కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# భీంగల్ అభివృద్ధికి సహకరించండి





**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** భీంగల్ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పట్టణ ప్రగతికి సంపూర్ణ సహకారం అందించాలని నూతనంగా ఎన్నికైన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. గురువారం భీంగల్ పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని, ఇందుకు ప్రజాప్రతినిధుల మద్దతు అవసరమని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, ఉపాధ్యక్షుడు రఘు, కోశాధికారి భూమేష్, రైటర్ రాజు, సభ్యులు తోట గంగాధర్, కన్నె సురేందర్, సుంకరి సురేష్, లింగం, ప్రసాద్ మరియు కమిటీ సలహా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా సాగాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠీ




**నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకగా, నిబంధనల మేరకు సాగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అధికారులను ఆదేశించారు. గురువారం భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ తీరును, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. అభ్యర్థులు నామినేషన్లు వేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, అనవసర వ్యక్తులను లోపలికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించిన వీడియో గ్రాఫీ, డాక్యుమెంటేషన్ ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు జరగకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు నామినేషన్ల సంఖ్య మరియు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓ మరియు ఇతర ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్

- పదవీ విరమణ పొందిన రమాదేవి, మస్తాన్ రావులకు సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి కొనియాడారు. బోధన్ పట్టణ కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, విధుల్లో చేరిన నాటి నుంచి పదవీ




విరమణ వరకు అంకితభావంతో పనిచేసిన రమాదేవి, మస్తాన్ రావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. రమాదేవి, మస్తాన్ రావు తమ సుదీర్ఘ సర్వీసులో గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, వారి సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు, పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచడంలోనూ, గ్రంథాలయ వాతావరణాన్ని మెరుగుపరచడంలోనూ వారు చూపిన చొరవను గుర్తుచేశారు. పదవీ విరమణ అనేది కేవలం విధులకు మాత్రమేనని, సమాజ సేవలో వారు నిరంతరం భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పలువురు విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# రెంజల్‌లో అక్రమ ఇసుక ట్రాక్టర్ సీజ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, 30 జనవరి(డీడీ9 వార్త) :** రెంజల్ మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, యజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

